సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం : 26 : డిసెంబర్ : 2023



క్రీడా సమరానికి సిద్ధం

ఆడుదాం ఆంధ్రా నేటి నుంచి మొదలుకానుంది. మైదానాలు సిద్ధం చేశారు.

- 8లో



పండగ బెల్లం రెడీ

నాగావళి తీరంలో కొత్త బెల్లం తయారవుతోంది. ఈ బెల్లానికి మంచి గిరాకీ ఉంది.

- 8లో

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి అనివేటి మండపంలో నిర్వహిస్తున్నామని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. గ్రామపెద్దలు, ఆలయ పాలక మండలి సభ్యుల సమక్షంలోనే హుండీలను తెరిపించి నిబంధనల ప్రకారం లెక్కింపు చేపట్టనున్నామని ఆయన వివరించారు.

న్యూస్‌రీల్

షాదీఖానా మంజూరు

కోటబొమ్మాళి: కొత్తపేట పంచాయతీలోని జగనన్న కాలనీ సమీపంలో ముస్లింల కోసం షాదీఖానా నిర్మాణానికి స్థలంతో పాటు నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు శంకుస్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన సమయంలో కొత్తపేటకు చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్‌రాజూబాయ్ షాదీఖానా మంజూరుచేయాలని వినతిపత్రం అందజేశారు. దీంతో సీఎం కలెక్టర్‌కు ఆదేశించడంతో ఆయన తహసీల్దార్ జామి ఈశ్వరమ్మను అప్రమత్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ 10 సెంట్ల స్థలాన్ని గుర్తిస్తూ మంజూరుకు ఇటీవలి ప్రతిపాదన పంపారు. అడిగిన వెంటనే ముఖ్యమంత్రి స్పందించి షాదీఖానా మంజూరు చేశారని, భవనం నిర్మాణానికి ముస్లిం మైనారిటీ బోర్డు ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని, స్థలంపై కలెక్టర్ ఉత్తర్వులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని రంజాన్‌రాజూబాయ్ సోమవారం తెలిపారు.

అలరించిన కన్యాశుల్కం



కన్యాశుల్కం నాటకంలో ఓ సన్నివేశం

అరసవల్లి: స్థానిక అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ పుష్కరిణి వద్ద వైజయంతి ఉత్సవ వేదికలో గురజాడ కన్యాశుల్కం నాటకం సోమవారం సాయంత్రం అద్భుతంగా ప్రదర్శించారు. దివంగత రాజకీయ వేత్త, సినీ నటుడు, మాజీ మంత్రి చిగిలిపల్లి శ్యామలరావు జ్ఞాపకార్థం ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ సమక్షంలో శ్రీసుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 31 వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న క్రమంలో తొలిరోజున చిగిలిపల్లి శ్యామలరావు ట్రస్ట్ సౌజన్యంతో కన్యాశుల్కం నాటకాన్ని సుమిత్ర కళాసమితి సభ్యులే ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమంలో సుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, డాక్టర్ కె.సోమేశ్వరరావు, చిగిలిపల్లి శ్యామలరావు ట్రస్ట్ ప్రతినిధులు చిగిలిపల్లి శిరీషా శ్రీనివాస్, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మున్సిపల్ ఇంజినీర్ డాక్టర్ సుగుణాకరరావు, అంబేద్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గుంట తులసీరావు, నాగావళి కృష్ణ, పులఖండం శ్రీనివాసరావు, యామిజాల గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



చిన్నారి వైద్యానికి సాయం అందిస్తున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ ప్రతినిధులు

కంచిలి, కవిటి: మండలంలోని జాడుపూడి పంచాయతీ పరిధి బసవపుట్టుగ గ్రామానికి చెందిన బొరియాశెట్టి శంకరరావు–శైలజ దంపతుల కుమార్తె లినీషా వైద్యం కోసం ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ వారు ఆర్థిక సాయం అందజేశారు. ఈ చిన్నారికి పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఉంది. దీనిపై నవంబర్ 24న సాక్షిలో 'పసి హృదయం .. కోరుతోంది సాయం' అనే శీర్షికన కథనం ప్రచురించారు. దీనిపై కవిటి మండలానికి చెందిన ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ వారు స్పందించారు. చిన్నారి వైద్య ఖర్చులకు సోమవారం రూ. 13వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధు లు నర్సు సోమేశ్వరరావు, బల్ల కాంతారావు, మామిడి జగ్గారావు, ధూపాన సునీల్ పాల్గొన్నారు.

ఆర్ఎంఓకు అభినందనలు



డాక్టర్ కూన మోహనబాబుకు సత్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌కు అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆర్ఎంఓగా నియమితులైన ప్రముఖ వైద్యులు డాక్టర్ కూన మోహనబాబును స్థానిక ఉద్యోగులు అభినందించారు. ఆస్పత్రిలో సోమవారం ఆయనకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలిసి పూలబొకే అందించి సాలువతో సత్కరించారు.

మెర్రీ క్రిస్మస్



శ్రీకాకుళంలోని ఓ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు
(ఇన్‌సెట్లో) శ్రీకాకుళం క్రైస్తవ ఆరాధన మందిరంలో ప్రసంగిస్తున్న గోడి శామ్యూల్

ఆరాధకుల ప్రార్థనలతో క్రీస్తు మందిరాలు ప్రతిధ్వనించాయి. విశ్వాసకుల వేడుకలతో చర్చిలు సందడిగా మారాయి. జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రార్థనలతో పాటు క్యాండిల్ సర్వీసులు, గీతాలాపనలు, కేక్ కటింగ్‌లు ఎక్కడికక్కడ నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



ప్రార్థన చేస్తున్న యువతి



కాశీబుగ్గ: క్రిస్టియన్ ప్రేయిర్ టెంపుల్‌లో కొవ్వొత్తులతో..



నరసన్నపేట: ఎస్సీ బాలికల వసతి గృహంలో క్రిస్మస్ ట్రీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



కొత్తూరు: నివగాం చర్చిలో క్రిస్మస్ సందేశాన్ని ఇస్తున్న బ్రదర్ రాజు

దశాబ్దాల స్వప్నం సాకారం

- శంకుస్థాపన చేసిన 9 నెలల్లోనే మూలపేట పోర్టు ఆకృతి నిర్మాణాలు
- 1000 మీటర్లకు పైగా సౌత్ బ్రేక్ వాటర్ పనులు
- 501 మీటర్లకు పైగా నార్త్ బ్రేక్ వాటర్ పనులు
- అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభం

టెక్కలి: జిల్లా ప్రజలు దశాబ్దాలుగా కంటున్న కల నేటికి సాకారమవుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతబొమ్మాళి మండలం మూలపేట ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు శ్రీకారం చుట్టడమే కాకుండా.. అన్ని అవాంతరాలు దాటుకుని శంకుస్థాపన చేయడంతో పాటు కేవలం 9 నెలల వ్యవధిలోనే పోర్టు నిర్మాణాలు వేగవంతం చేసి ఓ ఆకృతికి తీసుకువచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసిన తర్వాత ఎక్కడా పనులకు ఆటంకం లేకుండా చకచకా వేగవంతం చేస్తున్నారు. ఇటీవల పలాస విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఏరియల్ వ్యూ ద్వారా పనులను పరిశీలించారు.



మూలపేట పోర్టులో బెర్త్‌ల నిర్మాణాలు

వడి వడిగా సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ పనులు

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టులో ఇప్పటికే 1000 మీటర్లకు పైగా సౌత్ బ్రేక్ వాటర్ పనులు, 501 మీటర్లకు పైగా నార్త్ బ్రేక్ వాటర్ పనులు జరిగాయి. వీటితో పాటు టెక్కలి జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు పనులకు చర్యలు వేగవంతంగా జరుగుతున్నాయి. అంతే కాకుండా పోర్టు ఏరియాలో బెర్త్‌ల నిర్మాణాలు సైతం ఊపందుకున్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరో వైపు నౌపడ వద్ద పునరావాస కాలనీ నిర్మాణాలకు క్షేత్ర స్థాయిలో పనులు చేపడుతున్నారు.



టెక్కలి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని అప్రోచ్ రోడ్డు పనులు



మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణంలో వెయ్యి మీటర్లకు పైగా సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం

నాలుగు అంచెల రొయ్య ఫారంలతో లబ్ధి

గార:

రొయ్యల పెంపకంలో నూతన విధానమైన నాలుగు అంచెల ఫారంలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర మత్స్యశాఖ సెక్రటరీ అభిలాక్షి లిఖి అన్నారు. సోమవారం తోనంగి వద్ద లక్ష్మీపతిరాజు నిర్వహించిన రొయ్యల చెరువును ఆయన పరిశీలించారు. సముద్ర ఇసుక దిబ్బలపై సులువుగా ఏర్పాటు చేసేందుకు ఈ విధానం పనికి వస్తుందన్నారు. ఈ విధానంలో నాణ్యమైన రొయ్య దిగుబడితో పాటు వైరస్ దాడి చాలా తక్కువగా ఉంటుందన్నారు. నూతన పద్ధతిలో రొయ్యలకు మేత వేసే విధానం కూడా చెరువులో ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ అందించడం కూడా కొత్త విధానం ద్వారా అమలు చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో రైతులకు కూడా ఇక్కడ శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఫిషరీస్ జేడీ లాల్ మహమ్మద్, శ్రీకాకుళం జేడీ వై. సత్యనారాయణ, ఎఫ్‌డీఓ బగాది సురేష్‌కుమార్, సుబ్బరాజు, జగదీష్‌రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన విధానాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మత్స్యశాఖ సెక్రటరీ అభిలాక్షి లిఖి

నిశిరాత్రిలో ప్రసవం

- గర్భిణికి సపర్యలు చేసి ప్రసవం చేసిన 108 వాహనం సిబ్బంది
- తల్లీబిడ్డ క్షేమం

కాశీబుగ్గ: రాత్రి మూడు గంటల సమయంలో పురిటి నొప్పులు అనుభవిస్తున్న ఓ గర్భిణికి 108 సిబ్బంది సపర్యలు చేసి ప్రసవం చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి అనంతపురం ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న కె.రోజాకు అర్ధరాత్రి దాటిన అనంతరం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు పలాస 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన బయల్దేరి అనంతపురం చేరుకుని రోజాను అంబులెన్స్ ఎక్కించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ రాత్రి పూట వైద్యులు అందుబాటులో లేరని, కడుపులో బిడ్డ విషయంలో ఏదో తేడా ఉందని అక్కడున్న సిబ్బంది టెక్కలి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో టెక్కలికి వెళ్తుండగా మార్గం మధ్యలోనే ఆమెకు పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో రోడ్డుపైనే ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈఎంటీ డి.హేమరాజు, పైలెట్ బి.రవికుమార్‌లు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రసవం చేశారు. అనంతరం తల్లీబిడ్డ క్షేమంగా ఆస్పత్రికి చేరారు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



ప్రభుత్వ 108 అంబులెన్సులో ప్రసవమైన రజనీ, పక్కన బిడ్డను చూపుతున్న సిబ్బంది

తినగ తినగ.. ఉద్దానం మునగ

- ఉద్దానం మునగకు భలే డిమాండ్
- రోజుకి 5క్వింటాళ్ల మునక్కాయలు ఎగుమతి
- సంక్రాంతి వరకు మంచి సీజన్

పలాస: ఉద్దానంలో మునగ విరగ్గాసింది. ఇక్కడి మునక్కాయలకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. సంక్రాంతి ముందు చక్కగా దిగుబడి రావడంతో రైతులు రోజుకు ఐదు క్వింటాళ్ల మునక్కాయలను ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి ఎర్రమట్టి, ఇసుక దిబ్బలు, ఈ దిబ్బల మీద జాతీయ రహదారికి అటు సముద్ర తీర ప్రాంతానికి మధ్య ఉన్న సువిశాల తీరప్రాంతంలో వాణిజ్య పంటలు బాగా పండుతాయి. ఉద్దానం ప్రాంతంలో సుమారు 24వేల హెక్టార్లలో జీడి కొబ్బరి పంటలు సాగవుతున్నాయి. ఈ జీడి కొబ్బరిలో అంతర పంటగా మునగను రైతులు సాగుచేస్తున్నారు. మునగ పంట ఏడాదికి మూడు సార్లు కాపునకు వస్తుంది. ముఖ్యంగా సంక్రాంతికి ముందు నవంబరు చివరి నుంచి జనవరి వరకు కాపునకు వస్తుంది. ప్రతి ఎకరా తోటలో బయళ్ల మధ్య ఈ మునగ చెట్లు 10 నుంచి 20 వరకు ఉంటాయి. వీటి వల్ల సంక్రాంతికి ముందు రైతులకు కాసులు కురిపిస్తాయి. ప్రస్తుతం పలాస మార్కెట్‌లో కిలో మునగ ధర రూ.70లు ఉంది. ప్రతి రైతు రోజుకి 10కిలోల నుంచి 20కిలోల వరకు తెచ్చి పలాసలోని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పలాస రెవెన్యూ డివిజన్‌లోని 7 మండలాల పరిధిలో ఈ మునగ సాగవుతుంది. ఇక్కడ సాగయిన మునగ పంటను పలాస వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.



ఉద్దానం మునగ కాయలు

కష్టకాలంలో చేతికి డబ్బులు



మా ప్రాంతంలో సంక్రాంతి ముందు చాలా ఇబ్బందులు ఉంటాయి. ఆర్థికంగా ఎలాంటి ఆధారం, అవకాశం లేని పరిస్థితిలో ఈ మునగ పంట మమ్మల్ని ఆదుకుంటోంది. నాకు జీడి కొబ్బరి తోటలో 20 చెట్లు ఉన్నాయి. రోజుకు 20కిలోలు తెచ్చి అమ్ముతున్నాను. సంక్రాంతి వరకు ఇలా దొరుకుతుంటాయి. మార్కెట్‌లో ధర కూడా బాగుంది.

– ఎంపల్లి తిరుపతిరావు, రైతు, అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు మండలం

పోషక విలువలు పుష్కలం

ఉద్దానంలో సాగవుతున్న ఈ మునగ పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండటానికి గల కారణం ఇక్కడ మట్టి సారమని అందరూ చెబుతుంటారు. ఇక్కడి మునగ కాయలు చాలా రుచిగా ఉంటాయి. వీటి ఆకులను కూడా రసంగాను, కర్రీ గాను వినియోగిస్తారు. ఇందులో అపారమైన పోషక విలువలు, ఔషధ గుణాలు ఉండటంలో ప్రతి ఒక్కరు వినియోగిస్తారు.



మునక్కాయలను తూకం వేస్తున వ్యాపారులు

మొదటి రోజు 25కిలోలు అమ్మాను



మా జీడితోటలో మునగ చెట్లు ఉన్నాయి. ఈ ఏడాది పెద్దగా కాపునకు రాలేదు. అయినా ఫరవాలేదు. మొదటి రోజు 25కిలోలు ఆటో మీద తీసుకొచ్చి అమ్మాను. పండగ ఖర్చులకు ఇబ్బంది ఉండదు. జీడి పిక్కలు ఇంకా మరో మూడు నెలలు ఉన్నాయి. ఈ మునగ పంట వల్ల అప్పటి వరకు ఆర్థిక ఇబ్బందులు కొంత తీరుతాయి.

– జుత్తు కూర్మారావు, రైతు, మామిడిపల్లి, పలాస మండలం

రోజుకి 5క్వింటాళ్లు ఎగుమతి



ప్రస్తుతం పలాస నుంచి రోజుకి 5 క్వింటాళ్ల మునక్కాయలను ఎగుమతి చేస్తున్నాం. మాకు పలాస, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి కొన్ని గ్రామాలకు వస్తాయి. పూండి, హరిపురం, కంచిలి, సోంపేట తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా వ్యాపారం జరుగుతుంది. మేము కొనుగోలు చేసినవి ప్రస్తుతం బరంపురం, భువనేశ్వర్, కటక్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాము.

– అచ్యుత పాత్రో, మునగ కాయల వ్యాపారి

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో సినీ నటి సురభి



నటి సురభికి ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న మండవిల్లి రవి, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సినీ నటి సురభి పురాణిక్ సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి గౌరవ స్వాగతం పలికి అంత రాలయ దర్శనం చేయించారు. అనంతరం అరసవల్లి క్షేత్రం విశిష్టతను ఆమెకు శంకరశర్మ వివరించారు. ఈ సందర్భంగా నటి సురభి మాట్లాడుతూ తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేశానని, ఈ ఏడాదిలో డిడి రిటర్న్స్ అనే తమిళ సినిమాలో నటించానన్నారు. వచ్చే 2024లో కొత్త ప్రాజెక్టులతో పలు సినిమాల్లో నటించనున్నట్టుగా వివరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో వరికుప్పలు దగ్ధం

మందస: మండలంలోని పిడిమందస గ్రామంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. వరి పొలంలోని దాసరి కుబేరు అనే రైతుకు సంబంధించిన వరికుప్పలు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసినప్పటికీ, ధాన్యం కూడా కాలిపోవడంతో రైతుకు నష్టం వాటిల్లింది.

మూడు ఉద్యోగాలు సాధించిన నరేష్



బోర నరేష్

పాతపట్నం: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని ఆ యువకుడు నిరూపించాడు. ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన అంకిత భావం, క్రమశిక్షణ, పట్టుదలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని నిరూపించి, మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. మండలంలోని పాశీగంగుపేట గ్రామానికి చెందిన బోర నరేష్ పోలీసు శాఖలో ఇటీవల వెల్లడైన సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఎస్ఐ) ఉద్యోగాల ఎంపిక పరీక్షలో ఓపెన్ కేటగిరీలో జోన్–01లో ఆరో ర్యాంకు సాధించి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఆర్ఎస్ఐ)గా ఎంపికయ్యాడు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో రిజర్వు పోలీసుకు ఎంపికయ్యాడు. ఇటీవల ఎంక్వరీ కూడా జరిగింది. 2022లో ఎస్ఎస్‌సీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా కూడా ఎంపికయ్యాడు. రైతు కుటుంబంలో పుట్టి తల్లి బోర రమణమ్మ సంరక్షణలో బీటెక్ చదివాడు. కష్టానికి తగిన ప్రతిఫలం రావడంతో ఆనందం వ్యక్తం చేశాడు.

పోలియో నివారణకు రూ.3 లక్షల విరాళం



సోంపేట రోటరీ ప్రతినిధులను అభినందిస్తున్న జిల్లా గవర్నర్ సుబ్బారావు

సోంపేట: పోలియో నివారణకు సోంపేట రోటరీ ప్రతినిధులు రూ.మూడు లక్షల విరాళాన్ని రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావుకు అందజేశారు. సోంపేట పట్టణంలో మొదటిసారిగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పోలియో సెమినార్ నిర్వహించారు. రోటరీ ప్రతినిధులు రూ.మూడు లక్షల విరాళం అందజేయడంతో క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావుకు ప్లాటినం అవార్డు అందజేశారు. సెమినార్‌లో వివిధ ప్రాంతాల నుంచి రోటరీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు జి.ఎం రామారావు, డాక్టర్ ఎంవీ రామారావు, శోభన్ ప్రకాష్, టీఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

తల్లిని కట్టి కొట్టిన కొడుకు అరెస్టు

భువనేశ్వర్: కెంజొహార్ జిల్లాలోని చంపువా పోలీసుస్టేషన్ పరిధి సరసపోషి గ్రామంలో తోటలో క్యాబేజీ కోసినందుకు కన్నతల్లిపై కర్కశంగా దాడిచేసిన కొడుకు శతృఘ్న మహంత (39)ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సరసపోషి గ్రామానికి చెందిన సుభద్ర మహంత్‌కు ఇద్దరు కొడుకులు. తల్లి, కొడుకులంతా వేర్వేరుగా ఉంటున్నారు. సుభద్ర తన చిన్న కొడుకు శతృఘ్న మహంత తోటలో క్యాబేజీని కోసి వండుకుంది. ఈ విషయం తెలుసుకున్న కొడుకు తన తల్లితో గొడవ పడ్డాడు. అంతటితో ఆగక కోపంతో తల్లి సుభద్రను గ్రామం మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి తీవ్రంగా కొట్టాడు. అడ్డుకోబోయిన గ్రామస్తులపై ఎదురు దాడికి దిగి బెదిరించాడు. ఈ విషయమై గ్రామస్తులు చంపువ థాణా పోలీసులకు సమాచారం అందించారు. చంపువా పోలీసులు వచ్చి బాధితురాలు సుభద్రను రక్షించి బాసుదేబ్‌పూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అనంతరం కొడుకుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

క్రీడా సమరానికి సిద్ధం

- నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలు
- 47 రోజుల పాటు సుదీర్ఘంగా మెగా టోర్నమెంట్
- 732 సచివాలయాల పరిధిలో 670 మైదానాల్లో జరగనున్న పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం నుంచి మొదలుకానున్నాయి. జిల్లాకు సంబంధించి నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం వేదికగా ఆడుదాం ఆంధ్ర పోటీలు ఉదయం 11 గంటలకు అధికారికంగా మొదలుకానున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు యువత, విద్యార్థులు ఎంతగానో ఆసక్తి చూపిస్తున్నారు. రిజిస్ట్రేషన్లకు విశేష స్పందన లభించింది. ఇప్పటికే పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో 15 ఏళ్లు పైబడిన యువత, విద్యార్థులు, క్రీడాకారులు 1,35,622 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. దీంతో రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లో శ్రీకాకుళం జిల్లా 14వ స్థానంలో నిలిచింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్(డబుల్స్), క్రికెట్ ఇలా మొత్తం 5 క్రీడాంశాల్లో 47 రోజుల పాటు గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి మొదలుకుని మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకూ ఇలా ఐదు స్థాయిల్లో ఈ మెగా టోర్నమెంట్ జరగనుంది.

732 సచివాలయాలు 670 మైదానాలు..

జిల్లా వ్యాప్తంగా 732 సచివాలయాల పరిధిలో బాలురు, బాలికలను వేర్వేరు జట్లుగా విభజించి 'ఆడుదాం..ఆంధ్రా' పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పోటీల నిర్వహణకు 670 క్రీడామైదానాలను సిద్ధం చేశారు. పోటీల నిర్వహణకు ఆయా మైదానాల్లో క్రీడా కోర్టులను సిద్ధం చేసి, మార్కింగ్‌లు పూర్తిచేశారు. తుది మెరుగులు దిద్దారు. వాలీబాల్ జట్లలో 12 మంది, కబడ్డీలో 12 మంది, ఖోఖో జట్టులో 15 మంది, క్రికెట్లో 16 మంది, బ్యాడ్మింటన్ డబుల్స్ జట్టుకు ఇద్దరు చొప్పున క్రీడాకారులు ఉండే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సచివాలయ స్థాయిలో మండలస్థాయికి వెళ్లే టీమ్‌లను ప్రతిభ ఆధారంగా ఎంపికచేశారు. మండలస్థాయి పోటీలకు వెళ్లే టీమ్‌లకు టీషర్టులు, క్యాప్‌లు అందజేస్తారు. 400 మంది పీడీ/పీఈటీలు ఇప్పటికే పోటీల నిర్వహణ కోసం రిలీవ్ అయ్యారు. వీరంతా మండల ఎంపీడీఓలకు రిపోర్ట్ చేశారు. వీరితోపాటు కోచ్‌లు, నేషనల్స్ ప్లేయర్స్, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పోటీల నిర్వహణలో నిమగ్నం కానున్నారు.



ఆడుదాం ఆంధ్రా లోగో

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గ స్థాయిలో	జిల్లా స్థాయిలో	రాష్ట్ర స్థాయిలో
ప్రథమ	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ.15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5వేలు	రూ.10వేలు	రూ.2 లక్షలు

బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గ స్థాయిలో	జిల్లా స్థాయిలో	రాష్ట్ర స్థాయిలో
ప్రథమ	రూ.20వేలు	రూ.35వేలు	రూ.2లక్షలు
ద్వితీయ	రూ.10వేలు	రూ.20వేలు	రూ.లక్ష
తృతీయ	రూ.5వేలు	రూ.10వేలు	రూ.50వేలు





ఇచ్ఛాపురం: సిద్ధమవుతున్న సురంగిరాజా మైదానం



వాలీబాల్ సాధనలో యువకులు

ఆడుదాం ఆంధ్రా షెడ్యూల్ ఇది..

- ఆడుదాం ఆంధ్ర మెగా టోర్నమెంట్ పోటీలు ఆదివారాలు, పండుగలు మినహాయించి మొత్తం 47 రోజులపాటు సుదీర్ఘంగా జరగనున్నాయి.
- సచివాలయ స్థాయి పోటీలు ఈ నెల 26 నుంచి జనవరి 9వ తేదీ వరకు 15 రోజులపాటు జరుగుతాయి.
- మండల స్థాయి పోటీలు జనవరి 10 నుంచి 23వ తేదీ వరకు 14 రోజులపాటు జరుగుతాయి.
- నియోజకవర్గ స్థాయి పోటీలు జనవరి 24 నుంచి 30వ తేదీ వరకు 7 రోజులపాటు జరుగుతాయి.
- జిల్లా స్థాయి పోటీలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు 6 రోజులపాటు జరగనున్నాయి.
- రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు 5 రోజులపాటు జరగనున్నాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేశాం. కలెక్టర్ నేతృత్వంలో జిల్లాలో 670 క్రీడామైదానాల్లో పోటీల నిర్వహణకు చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ఇప్పటికే 1.35 లక్షల మందికిపైగా క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అందరూ సహకరించి ఈ క్రీడా పోటీలను విజయవంతం చేయాలి. పోటీల నిర్వహణకు అవసరమైన క్రీడా సామగ్రిని ఇప్పటికే జిల్లాలోని 732 సచివాలయాలకు చేరవేశాం.

– డాక్టర్ కె.శ్రీధర్‌రావు, డీఎస్‌డీఓ, శ్రీకాకుళం క్రీడాప్రాధికార సంస్థ

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అంబేడ్కర్ అందించిన స్ఫూర్తితో భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని దళిత ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో దళిత ప్రజా సంఘాల ఐక్య ఆధ్వర్యంలో అంబేడ్కర్– మనస్మృతి అనే అంశంపై కల్లేపల్లి రామ్‌గోపాల్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జాతీయ మానవ వికాస కేంద్రం అధ్యక్షులు బి.సాంబశివరావు మాట్లాడుతూ మనుధర్మ శాస్త్రం అనేది ఒక ప్రాచీన గ్రంథమని, దాన్ని ఈరోజు కేంద్రంలో ఉన్న బీజేపీ బలవంతంగా అమలు చేయాలని చూస్తోందని అన్నారు. ప్రాచీన, ఆధునిక మనువాదానికి వ్యతిరేకంగా బహుజనులు పెద్దఎత్తున పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, జన చైతన్య మండలి కళాకారులు కొమ్మల దమయంతి బృందం పాటలు ఆలాపన చేశారు. గరిమెళ్ల అధ్యయన కేంద్రం కన్వీనర్ విజీకే మూర్తి, కొప్పల భానుమూర్తి, కోత ధర్మారావు, బడే కామరాజు, కంఠ వేణు, బొనెల రమేష్, సల్ల రామారావు, పాండ్రంకి శ్రీను, ఎడ్ల గోపి, అప్పారావు, ఆదినారాయణ, బొత్స బుద్దుడు, బోనెల అప్పారావు, రాకోటి రాంబాబు, యడ్ల జానకిరావు, రిటైర్డు ఐఏఎస్ రుంకు అప్పారావు, గురువులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

వ్యాన్ ఢీకొని వృద్ధుడు..

బాడంగి: మండలంలోని గజరాయునివలస గ్రామానికి చెందిన వృద్ధుడు నడిమింటి సత్యనారాయణ(70) బొలెరో వ్యాన్ ఢీకొని సోమవారం మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో ఊసుపోక గ్రామంలో రోడ్డుపక్కన పాన్‌షాప్‌వద్దకు వచ్చి తనతోటి వృద్ధులతో మాట్లాడుతూ కాలక్షేపం చేస్తుండగా అదే సమయంలో గ్రామంలోకి వస్తున్న బొలెరో వ్యాన్ సత్యనారాయణ కాలిని ఢీకొని కొద్దిదూరం ఈడ్చుకుపోగా ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి భార్య పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్.జయంతి చెప్పారు. వ్యాన్‌డ్రైవర్ సంతోష్ దాస్‌ను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసినట్లు చెప్పారు. ఆ వ్యాన్ శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం వెల్లుపడకాలనీకి చెందినదన్నారు. సత్యం మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీకి పోస్టుమార్టం కోసం తరలించినట్లు ఎస్సై చెప్పారు.

'వాణిజ్యం, ఉపాధి లక్ష్యంగా వ్యవసాయం'



మాట్లాడుతున్న గేదెల శ్రీనిబాబు

ఎచ్చెర్ల క్యాంపస్: వాణిజ్యం, ఉపాధి లక్ష్యంగా వ్యవసాయం చేయాలని పారిశ్రామికవేత్త గేదెల శ్రీనిబాబు అన్నారు. ఎచ్చెర్లలో సోమవారం జరిగిన ఉత్తరాంధ్ర రైతుల చర్చలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో సాగునీటి కల్పన ద్వారా భవిష్యత్‌లో 12 లక్షల ఎకరాలు నుంచి 30 లక్షల ఎకరాలకు సాగు పెంచవచ్చునని అన్నారు. 25 టీఎంసీల నీటి వినియోగాన్ని, 80 టీఎంసీలకు పెంచేలా సాగునీటి ప్రాజెక్టులు అవసరమని తెలిపారు. రైతులు వాణిజ్య పంటపై దృష్టి సారిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని అన్నారు. తమ పల్సస్ గ్రూప్ ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తుందని చెప్పారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల వల్ల వ్యవసాయానికి మంచి భవిష్యత్‌తో పాటు ఉద్యోగాలు కూడా వస్తాయని వివరించారు. వాణిజ్య పంటల సాగుపై రైతులకు శిక్షణ అవసరమని చెప్పారు. ప్రధానంగా యువకులకు శిక్షణ ఇస్తే వ్యవసాయ రంగం ప్రగతి సాధిస్తుందని అన్నారు. డిజిటల్, ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సాంకేతిక అభివృద్ధి కోసం యూరోపియన్ వ్యవసాయ పద్ధతులు తెలుసుకోవాలన్నారు. యూరోపియన్ బిజినెస్ టెక్నాలజీ సెంటర్ ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రణాళికలను వివరించారు. విశ్వవిద్యాలయం, పరిశోధన సంస్థలు సాంకేతిక బదిలీ చేసేలా పల్సస్ సంస్థ కృషిచేస్తుందని చెప్పారు. వ్యవసాయంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి అధునాతన పద్ధతులు ప్రవేశపెట్టాలన్నారు. జీపీఎస్ ఆధారిత ఫీల్డ్ మ్యాపింగ్, రిమోట్ సెన్సింగ్‌తో పంట దిగుబడి ఆప్టిమైజ్ చేయటం, పర్యావరణపై ప్రభావం తగ్గించటం వంటివి యూరోపియన్ వ్యవసాయ పద్ధతుల్లో కీలకమన్నారు. వ్యవసాయంతో మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. రైతులు, యువతకు శిక్షణ అవసరమని వివరించారు.

పండగ బెల్లం రెడీ



చెరుకు నుంచి రసాన్ని యంత్రాలతో తీస్తున్న కూలీలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బెల్లం చెక్కీలు

- బెల్లం తయారీలో రైతులు బిజీ
- సొంత గానుగలతో బెల్లం తయారీ
- నాగావళి నదీ పరివాహక ప్రాంతంలో 300 హెక్టార్లలో చెరుకు సాగు

ఆమదాలవలస రూరల్: నాగావళి నదీ తీరంలో బెల్లం రెడీ అవుతోంది. ఇక్కడ గత పన్నెండేళ్లుగా రైతులు చెరుకు సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు వస్తుండటంతో చెరుకు పంటపై రైతులు మక్కువ చూపారు. కొత్తవలస, పాతూరు, నిమ్మతొర్లాడ, చేపానపేట, నెల్లిపర్తి, సిరిసింపేట, గరిమెళ్లకొత్తవలస గ్రామాల్లో సుమారు 300 హెక్టార్లలో చెరుకు సాగు చేస్తున్నారు. చెరుకుతో పాటు బెల్లం కూడా ఇక్కడి రైతులే స్వయంగా తయారు చేస్తారు. ప్రతి రైతు కూడా తన సొంత పొలంలోనే గానుగ వేస్తూ బెల్లం తయారు చేస్తారు. ఈ బెల్లానికి రాష్ట్రవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది.

పండగ వేళ..

నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో బెల్లం తయారు చేసే గ్రామాలుగా కొన్ని గ్రామాలు గుర్తింపు పొందాయి. చెరుకు పంటను సాగు చేసే రైతులు నేరుగా సొంతంగా బెల్లం తయారు చేసుకుని విక్రయిస్తారు. ప్రస్తుతం చెరుకు పంట చేతికి అందే దశలో ఉన్నందున గ్రామాల్లో బెల్లం తయారీ గానుగలు వెలిశాయి. రైతులే నేరుగా చెరుకు పంట చేసే పొలంలోనే గానుగ ఏర్పాటు చేసుకుంటున్నారు. చెరుకు నరికే దశ నుంచి బెల్లం తయారీ చేసి, మార్కెట్‌లో అమ్మకాలు చేసేంత వరకు రైతులు బిజీగా కాలం గడుపుతారు. ప్రస్తుతం సంక్రాంతి పండగ దగ్గర పడుతుండటంతో బెల్లం కొనుగోలు కాస్త ఎక్కువగా జరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఆదాయ మార్గాలు

చెరుకు ఎకరానికి 400 టన్నుల దిగుబడి వస్తుంది. దీని వల్ల బెల్లం దిగుబడి కాస్త పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. చెరుకు పంట సాగుచేయడానికి వ్యయ భారం ఎక్కువగానే ఉన్నా రాబడి కూడా ఆదే మార్గంలో ఉంటుంది. పొలంలోనే మోటార్లతో నీరు పెడుతూ విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చులు అన్నింటితో చెరుకు పంట పండించడానికి ఎకరానికి సుమారు రూ.40 వేలు వరకు ఖర్చవుతుంది. చెరుకు ద్వారా బెల్లం తయారు చేసి విక్రయిస్తే రూ.95 వేలు వస్తుంది. పండించిన చెరుకు పంటను సకాలంలో నరకాలి. పక్వ కాలపరిమితికి ముందుగా గానీ లేదా ఆలస్యంగా గానీ నరికితే బెల్లం తయారీకి పనికి రాదు. నరికిన చెరుకు పంటను గానుగ వద్దకు చేర్చి చెరుగు గెడల నుంచి రసాన్ని తీస్తారు. గానుగ ఆడిన రసం పులిసిపోకుండా పెనంలో వేసి మంట పెట్టి మరగబెడతారు. మరగబెట్టిన రసాన్ని ఆరబెట్టి బెల్లం ముక్కలుగా తయారు చేస్తారు. తయారు చేసిన బెల్లం ముక్కలను కేజీ పద్ధతిలో గ్రామాల్లోకి రైతులు వెళ్లి నేరుగా విక్రయాలు చేస్తారు. ఎకరం చెరుకు పంటను బెల్లం తయారు చేస్తే 2.5 టన్నులు వస్తుంది.

చెరుకు పంట లాభదాయకం



చెరుకు పంట సాగు చేయడంతో పాటు సొంతంగా బెల్లం తయారు చేసుకోవడం వల్ల రైతుకు లాభదాయకంగా మారుతుంది. ఈ ఏడాది నాకు పండిన చెరుకు పంట అంతా సొంతంగా గానుగ ఏర్పాటు చేసుకుని బెల్లం తయారు చేస్తున్నాం. ప్రస్తుతానికి చెరకు పంట పక్వానికి రావడంతో బెల్లం తయారీని ప్రారంభించాం. కొరపాం గ్రామంలో తయారుచేసిన బెల్లానికి మంచి గుర్తింపు ఉంది. రైతులకు సకాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందజేయడం, ఉచిత విద్యుత్ సరఫరా చేయడం వల్ల చెరకు పంటను సాగు చేసేందుకు సులువుగా ఉంటుంది.

– చేపాన కృష్ణ, కొరపాం గ్రామం, ఆమదాలవలస మండలం

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



మండలంలో నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో బెల్లం తయారీ ఎక్కువగా జరుగుతుంది. నేను మూడు ఎకరాల్లో చెరుకు పంటను సాగు చేస్తూ సొంతంగా గానుగ ఏర్పాటు చేసుకుని బెల్లం తయారు చేస్తాం. బెల్లం తయారీలో ఎలాంటి రసాయనాలు కలపకపోవడంతో ఇక్కడి బెల్లానికి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉంది. బెల్లం అమ్మకానికి మార్కెట్ సదుపాయం కల్పిస్తే మరికొంత మంది రైతులు ఈ బెల్లం తయారీపై ఆసక్తి చూపడానికి ఆస్కారం కలుగుతుంది.

– చేపాన తిరుపతిరావు, చేపానపేట, ఆమదాలవలస మండలం

సంక్రాంతికి బెల్లం చెక్కీలు

సంక్రాంతి పండగకు గ్రామాల్లో విరివిరిగా కొత్త బెల్లాన్ని కొనుగోలు చేస్తుంటారు. పిండి వంటకాల తయారీ, గ్రామాల్లో ఆలయాలకు నైవేద్యం కోసం కొత్త బెల్లాన్ని కొంటారు. దీని వల్ల సంక్రాంతి సమయంలో కొత్త బెల్లానికి డిమాండ్ ఏర్పడుతుంది. రైతులు కిలో మొదలుకుని 20 కిలోల వరకు బెల్లం చెక్కీలు తయారు చేస్తారు.

నంది నాటకోత్సవంలో గురుమూర్తి ప్రతిభ



నంది నాటకోత్సవంలో పోసాని కృష్ణమురళితో గురుమూర్తి

రణస్థలం: ఏపీ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులో ఈ నెల 23వ తేదీ నుంచి జరుగుతున్న నంది నాటకోత్సవంలో జేఆర్ పురం గ్రామానికి చెందిన కళాకారుడు బోనం గురుమూర్తి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. శ్రీ కాళహస్తీశ్వర మహత్యం పౌరాణిక పద్య నాటకంలో హరద్విజుడుగా గురుమూర్తి ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. పోసాని కృష్ణమురళి ఆధ్వర్యంలో ప్రతిభ అవార్డు, నగదు పురస్కారాన్ని అందుకున్నట్లు గురుమూర్తి తెలిపారు.

ఘనంగా 'సుపరిపాలన' దినోత్సవం



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పైడి వేణుగోపాలం, తదితరులు


శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో అవినీతికి తావు లేకుండా సుపరిపాలన అనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా అటల్ బిహారీ వాజ్‌పేయి నిలుస్తారని బీజేపీ నేత పైడి వేణుగోపాలం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో వేణుగోపాలం తన నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం వాజ్‌పేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సంపతి రావు నాగేశ్వరరావు, పైడి హరికృష్ణ, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా కార్యాలయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళంలోని శక్తి కేంద్ర ఇన్చార్జర్ జి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి వాజ్‌పేయికు ఘనంగా నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

- యువకుల అతివేగమే కారణం



ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ట్రాఫిక్ పీఎస్‌కు తరలిస్తూ..



పైడితల్లి మృతదేహాన్ని చూసి విలపిస్తున్న భార్య అప్పయ్యమ్మ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని మహిళా కళాశాల రోడ్డు మార్గంలోని మహలక్ష్మినగర్ సందులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే కాలనీకి చెందిన కొండపల్లి పైడిపల్లి (72) అనే వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. ముగ్గురు యువకులు అతివేగంతో ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్, మృతుని భార్య అప్పయ్యమ్మ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

మహలక్ష్మి నగర్ కాలనీకి చెందిన కొండపల్లి పైడితల్లి, తన భార్య అప్పయ్యమ్మతో కలిసి జీవిస్తున్నాడు. ఐదారేళ్ల క్రితం రిక్షా తొక్కుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కాళ్లనొప్పులు రావడంతో ఇంటిపట్టునే ఉండటంతో భార్య వేరే వారి ఇళ్లలో పనిచేస్తూ పోషిస్తున్నారు. ఒక్కగానొక్క కుమార్తెకు వివాహమైంది. పైడితల్లి సాయంత్రం వేళ టీ తాగుదామని మహలక్ష్మినగర్ సందుదాటి ఉమెన్స్ కాలేజీ రోడ్డుకు వచ్చారు. టీ తాగి తిరిగి వెళ్తూ కాలువ దాటుతుండగా సూర్యమహల్ జంక్షన్ నుంచి ఉమెన్స్ కాలేజీ రోడ్డు మలుపులో ముగ్గురు యువకులు బైక్‌పై అతివేగంతో వచ్చి వృద్ధుడిని ఢీకొట్టారు. 13 అడుగుల దూరం వరకు వృద్ధుడు ఈడ్చుకెళ్లడంతో తలకు బలమైన గాయమైంది. ప్రమాదం జరిగిన వెంటనే ఇద్దరు యువకులు పరారయ్యారు. డ్రైవింగ్ చేసిన యువకుడు వృద్ధుడికి సపర్యలు చేసి తన తండ్రి సాయంతో అంబులెన్స్ ఎక్కించి రిమ్స్‌కు తరలించారు. అయితే ఆస్పత్రి చేరేలోగానే వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. భర్త మృతదేహాన్ని చూసి అప్పయ్యమ్మ చిన్నపిల్లలా రోదించడం అక్కడున్న వారి చేత కంటతడి పెట్టించింది. ప్రమాదానికి కారణమైన ముగ్గురూ మైనర్లేనని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇదే ప్రాంతంలో ఈ నెల 17న కూడా ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. అప్పుడు కూడా బైక్ అతివేగం కారణంగానే ఓ యువకుడు చనిపోయాడు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వృద్ధుని ప్రమాదంపై అతని భార్య అప్పయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు.